సాక్షి జనగామ

గురువారం | 16 | అక్టోబర్ | 2025



క్రీడాపండుగకు వేళాయె..

హనుమకొండలోని నెహ్రూ స్టేడియంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. - 10లో▸



ఇన్‌చార్జ్‌లుగా పదోన్నతి..?

టీజీ ఎన్పీడీసీఎల్‌లో పదోన్నతుల కల్పనకు యాజమాన్యం సన్నద్ధమైనట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఉద్యోగాల వారీగా పదోన్నతి జాబితా సిద్ధం చేసినట్లు సమాచారం. - 10లో▸

గరిష్టం/కనిష్టం
$32^0/22^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం సమయంలో సాధారణ పరిస్థితి ఉంటుంది. రాత్రి సమయంలో అక్కడక్కడా చిరు జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేడు ఆర్టీసీ ‘డయల్ యువర్ డీఎం’

జనగామ: జనగామ ఆర్టీసీ డిపోలో ఈనెల 16న (గురువారం) డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ స్వాతి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బచ్చన్నపేట, దేవరుప్పుల, లింగాల ఘణపురం, నర్మెట, తరిగొప్పుల, రఘునాథపల్లి, మద్దూర్, పాలకుర్తి మండలాల పరిధిలో ఉన్న గ్రామాల ప్రజలు ఆర్టీసీ బస్సు సర్వీస్ సేవలకు సంబంధించి డయల యువర్ డీఎం ద్వారా సమస్యలతో పాటుగా సూచనలు, సలహాలను తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగే డయల్ యువర్ డీఎం ప్రోగ్రాంలో-99592 26050 ఫోన్ నెంబర్ కు కాల్ చేయాలన్నారు.

సోషల్ వెల్ఫేర్‌లో ఖాళీ సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

జనగామ: సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 2025-26 విద్యాసంవత్సరంలో ఖాళీగా(మిగిలిన) ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు దరఖాస్తుల చేసుకోవాలని గురుకులాల జిల్లా సమన్వయాధికారి పి.శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. 5వ తరగతిలో ప్రవేశం కోసం కామన్ ఎంట్రెన్స్ వీజీటీ సీఈటీ-2025 రాసిన వారితో పాటు రాయనివారు కూడా అర్హులుగా పేర్కొన్నారు. 6వ తరగతి నుంచి 9వ తరగతుల్లో ప్రవేశం కోసం తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బ్యాక్ లాగ్ వేకెన్సీ ఎగ్జామ్ బీఎల్‌వీ సీఈటీ-2025 రాసిన వారితో పాటు రాయని వారు కూడా అర్హులన్నారు. ఎంట్రెన్స్ రాసిన ఎగ్జామ్ హాల్ టికెట్ (పరీక్ష రాసిన వారు), ర్యాంక్ కార్డ్ (పరీక్ష రాసిన వారు), కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు (పరీక్ష రాసిన వారు, రాయని వారు) వీటిని వెంట తెచ్చువాలన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈనెల 16, 17 తేదీల్లో సాయంత్రం 5 గంటల లోపు దరఖాస్తును జనగామ సోషల్ వెల్ఫేర్ గురుకులంలో సమర్పించాలన్నారు. పరీక్ష రాసిన విద్యార్థులకు మొదటి ప్రాధాన్యం ఉంటుందన్నారు. పరీక్ష రాసిన పిల్లలు అందుబాటులో లేని పక్షంలో పరీక్ష రాయని వారికి కలెక్టర్ కార్యాలయంలో లాటరీ పద్ధతిలో సీట్లు కేటాయించడం జరుగుతుందన్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి



జనగామ రూరల్: రిటైర్డ్ ఉద్యోగుల పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని రిటైర్డ్ ఉద్యోగుల బకాయిల సాధన కమిటీ అధ్యక్షుడు బి.లక్ష్మయ్య డిమాండ్ చేశారు. బుధవారం సాధన కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. 18 నెలల నుంచి బకాయిలు చెల్లించకుండా జాప్యం చేయడం వల్ల రిటైర్డ్ ఉద్యోగ ఉపాధ్యాయులు ఆర్థికంగా, మానసికంగా ఇబ్బందిపడుతున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 26 మంది పెన్షన్‌దారులు అప్పుల బాధలకు కుంగిపోయి చనిపోయారన్నారు. కార్యక్రమంలో అంబటి రాజయ్య, ఇంద్రసేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ జిల్లా అధ్యక్ష పదవి మాదిగలకు ఇవ్వాలి

జనగామ: కాంగ్రెస్ జనగామ జిల్లా అధ్యక్ష పదవి ఈసారి మాదిగలకు కేటాయించి సముచితమైన స్థానం కల్పించాలని కోరుతూ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్‌కు జనగామ పట్టణ మాదిగ సంఘం ఆధ్వర్యంలో బుధవారం మెయిల్ ద్వారా వినతి చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు అవకాశం కల్పిస్తామని మీనాక్షి నటరాజన్ ప్రకటించడం స్వాగతిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పట్టణ మాదిగ సంఘం అధ్యక్షుడు ఉడుగుల కిష్టయ్య, ప్రధాన కార్యదర్శి గాదెపాక రామచందర్, కోశాధికారి మల్లిగారి మధు, వ్యవసాయక మార్కెట్ డైరెక్టర్ బొట్ల నర్సింగరావు, జేరుపోతుల కుమార్, బొట్ల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో విద్యార్థికి బంగారు పతకం

జనగామ రూరల్: రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పట్టణంలోని మైనారిటీ జూనియర్ కళాశాల బాలుర-1లో ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి కార్తీక్ బంగారు పతకం కైవసం చేసుకున్నాడు. ఈసందర్భంగా బుధవారం కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా విద్యార్థి కార్తీక్‌ను, పీడీ రాజుకు అభినందనలు తెలిపారు. ఇటీవల మహబూబాబాద్ జిల్లా కొమ్ములవంచలో నిర్వహించిన రాష్ట్రస్థాయి 69వ ఎస్‌జీఎఫ్ఐ పోటీల్లో ప్రతిభ కనబర్చి బంగారు పతకం అందుకున్నాడు. అలాగే జిల్లా మైనారిటీ అధికారి విక్రంకుమార్, కళాశాల ప్రిన్సిపల్ అనిల్ బాబు అభినందించారు.

జీవాలకు టీకా రక్ష

- గ్రామాల్లో గాలికుంటు నివారణ టీకాలు
- నెలరోజులపాటు కార్యక్రమం
- సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యుల సూచన
- జిల్లా వ్యాప్తంగా 1,45,000 పశువులు



టీకా వేస్తున్న సహాయ సంచాలకుడు దేవేందర్

జనగామ రూరల్: పశువుల్లో గాలికుంటు వ్యాధి నివారణ కోసం కేంద్ర ప్రభుత్వ సహాయంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ సంవత్సరం 6 నెలలకు ఒకసారి వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం నిర్వహిస్తోంది. దీనిలో భాగంగా ఈ సంవత్సరం ఉచిత గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని అన్ని జిల్లాల్లో పశువైద్య బృందాలు ప్రతీ గ్రామాన్ని సందర్శించి, 3 నెలల వయస్సు దాటిన గేదె జాతి, గోజాతి పశువులకు వ్యాధి నిరోధక టీకాలు ఇవ్వనున్నారు. ఏటా చలికాలంలో పశువులకు వ్యాధులు సోకే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. ఈనేపథ్యంలో పశుసంవర్ధక శాఖ ముందస్తు చర్యలు చేపట్టింది. బుధవారం నుంచి జిల్లావ్యాప్తంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ప్రత్యేక కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకుని, పశువులకు టీకాలు వేయించాలని అధికారులు సూచిస్తున్నారు.

నవంబర్ 14 వరకు టీకాలు

జిల్లాలో నాలుగు ఏరియా పశువైద్యశాలలు ఉండగా 23 ప్రాథమిక పశువైద్యశాలలు ఉన్నాయి. 20 సబ్‌సెంటర్లు ఉన్నాయి. ఆవులు 73,482, గేదెలు 75,029 ఉన్నాయి. వ్యవసాయానికి అనుబంధంగా ఉన్న పాడి పరిశ్రమతో ఆర్థికంగా బలపడుతున్న రైతులు నష్టపోకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఏటా రెండుసార్లు ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం నిర్వహిస్తున్నాయి. జిల్లాలోని 36 మండల టీంలు, 100 మందికి పైగా సిబ్బంది ఈనెల 15 నుంచి నవంబర్ 14 వరకు పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయనున్నారు. గ్రామాల వారీగా షెడ్యూల్ ప్రకారం ప్రతీరోజు ఉదయం 6 గంటల నుంచి ఉదయం 11 గంటల వరకు టీకాలు వేస్తారు.

లక్షణాలు ఇవి..నివారణ ఇలా..

గాలికుంటు వ్యాధిలో గేదెలు, ఆవులకు వైరస్ సోకుతుంది. వ్యాధి సోకిన పశువులు బక్కచిక్కి అల్సర్ బారినపడతాయి. రెండు నుంచి ఆరు రోజుల వరకు జ్వరం ఎక్కువగా ఉంటుంది. నోరు, పెదాలు, నాలుకతో పాటు కాళ్ల గిట్టల మధ్య పుండ్లు ఏర్పడతాయి. మేత, నీళ్ల సరిగా తీసుకోవు. వ్యాధి నిరోధక శక్తి తగ్గి పశువులు, దూడలు చనిపోయే ప్రమాదం కూడా ఉంటుంది. ఈనేపథ్యంలో వ్యాధి సోకిన పశువులకు ఆరోగ్య పరీక్షలు క్రమం తప్పకుండా చేయించాలి. పుండ్లను పొటాషియం పర్మాంగనేట్ లేదా నార్మల్ సెలైన్ వాటర్‌తో శుభ్రంచేయాలి. రెండోసారి ఇన్ఫెక్షన్ రాకుండా ఉండేందుకు యాంటీబయాటిక్స్ మందులు, వ్యాధినిరోధక శక్తిని పెంచడానికి బీ కాంప్లెక్స్ మందులు వాడాలి. అలాగే గాలికుంటు వ్యాధిపై నిర్లక్ష్యం వహించకుండా పశుసంవర్ధక శాఖ వైద్యుల మేరకు క్రమం తప్పకుండా ఏడాదికి రెండుసార్లు టీకాలు వేయించాలి. వ్యాధి సోకిన పశువులను ఇతర పశువులతో కలిసి ఒకేచోట ఉంచొద్దు. వారానికి ఒకసారి కొట్టంలో సున్నం చల్లి క్రిమికీటకాల నివారణకు చర్యలు చేపట్టాలి. వ్యాధి సోకిన గేదె, ఆవు నుంచి తీసిన పాలను 100 డిగ్రీల సెల్సియస్ వరకు వేడి చేసిన తర్వాతే తాగాలి. ఒకవేళ పశువు చనిపోతే గోతిలో బ్లీచింగ్ పౌడర్ చల్లి పాతిపెట్టాలని పశువైద్యులు సూచిస్తున్నారు.

ఉచితంగా టీకాలు వేస్తాం



రైతులు పశువుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి. ఈ నెల 15 నుంచి గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం నిర్వహిస్తున్నాం. షెడ్యూల్ ప్రకారం నవంబర్ 14 వరకు అన్ని గ్రామాల్లోని పశువులకు ఉచితంగా టీకాలు వేస్తాం. మేకలు, గొర్రెలు, పశువులకు ఎలాంటి వ్యాధులు సోకినా పశువైద్య సిబ్బందికి సమాచారం అందించాలి.

- ప్రాంతీయ పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు దేవేందర్

మరింత అంతరం!



ఓరుగల్లు కాంగ్రెస్‌లో తారస్థాయికి మంత్రుల మధ్య విబేధాలు

- వైరల్‌గా మారిన మంత్రి పొంగులేటిపై ఫిర్యాదుల ప్రచారం
- వివాదాస్పదంగా కొండా దంపతుల వ్యాఖ్యలు... సీరియస్‌గా తీసుకుంటున్న ప్రభుత్వం
- మొన్న ఏసీపీ, నేడు ఓఎస్‌డీ.. వేటు వేయడంపై దుమారం
- ముఖ్యమంత్రి పర్యటనకు దూరంగా కొండా దంపతులు
- జిల్లా రాజకీయాలపై ఇంటెలిజెన్స్ వర్గాల ఆరా...?

సాక్షిప్రతినిధి, వరంగల్ : అధికార కాంగ్రెస్ పార్టీలో అసలేం జరుగుతోంది.. మంత్రుల మధ్య అంతర్గత విభేదాలు తారస్థాయికి చేరాయా.. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొండా సురేఖ దంపతుల నడుమ అగాధం పెరిగిపోయిందా.. మేడారం టెండర్లపై ఇటీవల కాలంలో కొండా మురళి హైకమాండ్‌కు ఫిర్యాదు చేశారన్న ప్రచారం మరింత గ్యాప్‌ను పెంచిందా.. వరంగల్ రాజకీయాలపై పార్టీ, ప్రభుత్వం దృష్టి సారించిందా.. అంటే నిజమే అంటున్నారు రాజకీయ విశ్లేషకులు. ఇటీవల జరిగిన పరిణామాలే ఇందుకు తాజా ఉదాహరణలుగా చెబుతున్నారు. రోజురోజుకూ చినికి చినికి గాలివానగా మారుతున్న మంత్రులు, ఎమ్మెల్యేల మధ్య విబేధాలపై ఇటు అధిష్టానం.. అటు ప్రభుత్వం సీరియస్‌గా స్పందించాలన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

వివాదాస్పదంగా వ్యాఖ్యలు..

మంత్రులు, కొందరు ఎమ్మెల్యేల మధ్య రోజురోజుకూ అంతరం పెరుగుతోంది. రాష్ట్ర అటవీ, పర్యాటక, దేవాదాయశాఖల మంత్రి కొండా సురేఖ, ఆమె భర్త, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు వ్యాఖ్యలు పలుమార్లు వివాదాస్పదంగా మారాయి. కొద్ది రోజుల క్రితం ఓ ఎమ్మెల్యేపై చేసిన బాడీ షేమింగ్ వ్యాఖ్యలు దుమారమే రేపాయి. ఆ తర్వాత తమ నియోజకవర్గాల్లో జోక్యం చేసుకుంటున్నారని కొండా దంపతులపై కొందరు ఎమ్మెల్యేలు అధిష్టానం వరకు వెళ్లారు. వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేట, పరకాల, భూపాలపల్లి ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజు, రేవూరి ప్రకాష్‌రెడ్డి, గండ్ర సత్యనారాయణరావులు టీపీసీసీ చీఫ్, సీఎంలకు ఫిర్యాదు కూడా చేశారు. ఈ అంశంపై టీపీసీసీ క్రమశిక్షణ సంఘం కొండా సురేఖ, కొండా మురళీధర్‌రావులతో మాట్లాడింది. టీపీసీసీ చీఫ్, సీఎంల జోక్యంతో సద్దుమణిగినట్లే అనిపించినా.. అంతర్గతంగా ఇంకా రగులుతూనే ఉంది. ఇదే సమయంలో మేడారం సమ్మక్క-సారలమ్మల గద్దెల పునరుద్ధరణ, ఇతర అభివృద్ధి పనుల టెండర్ల విషయంలో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిపై కొండా మురళి ఏఐసీసీ, టీపీసీసీ పెద్దలకు ఫిర్యాదు చేసినట్లు మీడియాలో చక్కర్లు కొట్టింది. ఈ ప్రచారంపై సంప్రదించిన మీడియా ప్రతినిధులతో ‘నేను ఇంట్లోనే ఉన్నాను.. ఎవరిని కలవలేదు, ఫిర్యాదులు కూడా చేయలేదు’ అని మురళి స్పష్టం చేశారు. ఇవన్నీ జరుగుతున్న సమయంలోనే మంత్రి కొండా సురేఖ ఓఎస్‌డీ సుమంత్‌పై ప్రభుత్వం వేటు వేయడం, బుధవారం హనుమకొండకు వచ్చిన సీఎం రేవంత్ రెడ్డిని ఆమె కలవకపోవడం కూడా చర్చనీయాంశంగా మారింది.

వరుస వేట్లతో కలకలం..

అధికారుల మితిమీరినతనంపై చర్యల్లో భాగంగా ప్రభుత్వం.. ఇప్పటికే మంత్రి కొండా సురేఖ పరిధిలోని ఇద్దరు అధికారులపై వేటు వేసింది. వరంగల్ ఏసీపీ నందిరాం నాయక్ తూర్పులో వ్యవహరించిన తీరు వివాదాస్పదమైంది. నాయకుల బర్త్‌డే వేడుకలు జరపడం.. ఏ హోదా లేకున్నా ఎస్కార్టు ఇవ్వడంతోపాటు ఇతర కారణాలను చూపుతూ ఆయనపై ప్రభుత్వం బదిలీ వేటు వేసింది. నందిరాంనాయక్ స్థానంలో ఐపీఎస్ అధికారి శుభం ప్రకాశ్ నాగర్లేకు ఏసీపీ బాధ్యతలు ఇచ్చారు. తాజాగా మంత్రి సురేఖ పేషీలో ఓఎస్‌డీగా పనిచేసే సుమంత్‌ను ఆ పదవినుంచి ప్రభుత్వం మంగళవారం తప్పించింది. 2023 డిసెంబర్‌నుంచి ఈ పదవీ బాధ్యతలు చూస్తున్న సుమంత్ అభివృద్ధి పనుల్లో మితిమీరిన జోక్యం.. ఇటీవల మేడారం పనుల వివాదానికి కూడా కారణమన్న ఆరోపణలు ఉన్నాయి. స్వయంగా సీఎం విచారణకు ఆదేశించి.. ఆరోపణలు నిజమేనని తేలడంతో వేటు వేసినట్లు తెలుస్తోంది. ఈ రెండు ఘటనలు కొండా దంపతులు ప్రమేయం లేకుండా జరిగాయన్న ప్రచారం ఉండగా.. బుధవారం సీఎం పర్యటనకు హాజరు కాకపోవడంపైనా చర్చ జరుగుతోంది. ఇదిలా ఉంటే.. చాలా ఏళ్లుగా ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డితో కొండా దంపతులకున్న రాజకీయ విబేధాలు, వైరం కారణంగానే సీఎం పర్యటనకు సురేఖ దూరంగా ఉన్నారని వారి అనుచరులు చెబుతున్నారు. కాగా ఉమ్మడి వరంగల్ వ్యాప్తంగా మంత్రులు, కొందరు ఎమ్మెల్యేల మధ్య నెలకొన్న అంతర్గత విభేధాలు, కుమ్ములాటలకు చెక్ పెట్టే దిశగా పార్టీ, ప్రభుత్వం సీరియస్‌గా ఉన్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే ఐదారు రోజుల్లో సమగ్ర నివేదికలు ఇవ్వాలన్న ఆదేశాల మేరకు నిఘావర్గాలు రంగంలోకి దిగి ఆరా తీస్తున్నట్లు తెలిసింది.

కాటన్ యార్డు నుంచి కొనుగోలు కేంద్రాల మార్పు

జనగామ: జనగామ వ్యవసాయ మార్కెట్ కాటన్ యార్డులో ఏర్పాటు చేసిన శామీర్‌పేట, చీటకోడూరు ఐకేపీ సెంటర్లను గత సీజన్‌లో నిర్వహించిన చోటకు మార్చేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇటీవల అడపదడపా కురుస్తున్న వర్షాలతో భారీగా ధాన్యం తడిసిపోవడంతో పాటు గింజలు కొట్టుకుపోతుండడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ప్రస్తుతం కాటన్ యార్డులో ఉన్న సుమారు 30వేల బస్తాలను కొనుగోలు చేయనుండగా, ఈనెల 16న (గురువారం) కొత్త రైతులను ఇక్కడకు అనుమతి ఇస్తారా లేదా అనే విషయం సందిగ్ధంలో ఉంది. కాగా కేంద్రాల ప్రారంభానికి సంబంధించి అధికారిక ప్రకటన గురువారం వెలవరించనున్నారు.

రైలుబండెక్కి..రాజసంగా!



భారీ శబ్దంతో కూల్చివేతలు, మట్టి తవ్వకాలను చేపడుతూ కనపడే పొక్లెయినర్లు..చుక్ చుక్ బండిపై చక్కగా ముస్తాబై ఊరికెళ్తున్నట్లు కనిపిస్తోంది ఈ దృశ్యం.. కాజీపేట నుంచి సికింద్రాబాద్ వైపునకు ఓ గూడ్సు రైలు వందకు పైగా పొక్లెయినర్లతో వెళ్తోంది. బుధవారం ఆ రైలు కాసేపు స్టేషన్‌ఘన్‌పూర్ రైల్వేస్టేషన్‌లో ఆగింది. ఒక్కచోట వందకు పైగా పొక్లెయినర్లు రాజసంగా వరుసగా రైలుబండిపై కనిపించడంతో స్థానికులు ఆసక్తిగా తిలకించారు.

- స్టేషన్‌ఘన్‌పూర్

మిగిలింది మూడు రోజులే!

- ఇప్పటివరకూ నామమాత్రంగానే మద్యం టెండర్లు
- ఎక్సైజ్ శాఖ అధికారుల్లో టెన్షన్
- పాత వ్యాపారులు, ఉత్సాహవంతులకు ఫోన్లు



టెండరు ఫారాలను పరిశీలిస్తున్న ఎక్సైజ్ అధికారులు, పర్యవేక్షిస్తున్న సీఐలు

సర్కిల్ వారీగా టెండర్లు

సర్కిల్	దుకాణాలు	టెండర్లు
జనగామ	20	38
స్టే.ఘన్‌పూర్	16	27
పాలకుర్తి	14	18
మొత్తం	50	83

జనగామ: జిల్లా వ్యాప్తంగా మద్యం దుకాణాల టెండర్ ప్రక్రియ ఊహించని విధంగా మందగమనం దిశగా సాగుతోంది. టెండర్ దాఖలు గడువు ముగియడానికి కేవలం మూడు రోజులు మాత్రమే మిగిలి ఉన్నా, ఇప్పటివరకు జిల్లాలో టెండర్ల సంఖ్య నామమాత్రంగానే ఉంది. గత సీజన్‌లో సుమారు 2,500 వరకు టెండర్లు దాఖలైన చోట, ఈసారి 100 దాటలేని పరిస్థితి ఎక్సైజ్ శాఖ అధికారులను ఆందోళనకు గురిచేస్తోంది.

టెండర్ ఫీజు పెంపు ప్రభావం

టెండర్ ఫీజు రూ.3 లక్షలకు పెంచడం మద్యం వ్యాపారులకు పెద్ద అడ్డంకిగా మారింది. గతంలో ఫీజు తక్కువగా ఉండటంతో చిన్నస్థాయి వ్యాపారులు, స్థానిక పెట్టుబడిదారులు కూడా పోటీలో పాల్గొన్నారు. కానీ ఇప్పుడు భారీ మొత్తంలో డిపాజిట్ పెట్టాల్సి రావడంతో చాలామంది వెనక్కి తగ్గారు. ఇప్పటికే రియల్ ఎస్టేట్ రంగం కుప్పకూలిన నేపథ్యంలో లిక్కర్ వ్యాపారంలోనూ పెట్టుబడి పెట్టాలంటే ఆలోచిస్తున్నారు.

తగ్గిన వైన్స్ అమ్మకాలు

జిల్లాలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా పరిశీలిస్తే, చాలా చోట్ల వైన్స్ అమ్మకాలు గత ఏడాదితో పోలిస్తే 15 నుంచి 20 శాతం వరకు తగ్గినట్లు గణాంకాలు చెబుతున్నాయి. పెరిగిన ధరలు, వ్యయ నియంత్రణ, ఆర్థిక మందగమనం వంటి అంశాలు అమ్మకాలపై ప్రతికూల ప్రభావం చూపించాయి. ఈ పరిస్థితిలో కొత్త లైసెన్సుల కోసం ముందుకు వచ్చే వ్యాపారులు తగ్గిపోవడం సహజమేనంటూ విశ్లేషకులు అంగీకరిస్తున్నారు.

టెండర్‌దారులకు ఫోన్లు చేస్తున్న అధికారులు

టెండర్లు దాఖలు చేయడం తగ్గిపోవడంతో ఎక్సైజ్ శాఖ అధికారులు స్వయంగా పాత టెండర్‌దారులకు ఫోన్లు చేసి దరఖాస్తులు వేయమని అభ్యర్థిస్తున్నట్లు సమాచారం. జిల్లాస్థాయిలో కూడా శాఖ అధికారులు మద్యం వ్యాపారులతో సమావేశాలు నిర్వహిస్తూ టెండర్‌లో పాల్గొనే విధంగా అధికారులు క్షేత్రస్థాయిలో చక్రం తిప్పే ప్రయత్నం చేస్తున్నారు.

ఏపీ వ్యాపారుల ఎంట్రీ

ఈసారి ఆంధ్రప్రదేశ్ నుంచి కూడా కొంతమంది టెండర్ దారులు తెలంగాణ మార్కెట్‌లో అడుగు పెట్టే ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం. తెలంగాణలో లైసెన్సింగ్ విధానం కొంత సాఫీగా ఉండటం, కొన్ని పట్టణాల్లో వ్యాపార అవకాశాలు మెరుగ్గా కనిపించడం కారణంతో ఉత్సాహంగా ఉన్నట్లు ప్రచారం జరు గుతుంది. ఏపీలోని బడా వ్యాపారులు ఎంట్రీ అవుతున్నారనే ప్రచారం నేపథ్యంలో స్థానిక వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు.

గత సీజన్ ఉత్సాహం కనిపించడం లేదు

గత సీజన్‌లో మద్యం దుకాణాల కోసం పోటీ తీవ్రంగా ఉంది. ఒక్కో షాపునకు పదికిపైగా టెండర్లు వేశారు. కానీ ఈసారి ఆ ఉత్సాహం కనిపించడం లేదు. వడ్డీరేట్లు పెరగడం, అనేక చోట్ల లిక్కర్ విక్రయాలే తగ్గడం, రియల్ ఎస్టేట్ మందగమనం అనేక కారణాలతో టెండర్లపై ప్రభావం చూపిస్తోందని మాట్లాడుకోవడం గమనార్హం.

మున్సిపాలిటీల్లో నిబంధనలు సడలింపు

పురపాలిక(మున్సిపల్) పరిధిలో మద్యం దుకాణాలకు సంబంధించిన నిబంధనలకు ఎక్సైజ్ శాఖ అధికారులు సడలించారు. మున్సిపల్ లిమిట్స్‌లో వైన్స్ ఎక్కడైనా ఏర్పాటు చేసుకునే విధంగా ఆదేశాలు జారీ చేశారు. గతంలో వార్డు నెంబర్ల ఆధారంగా లక్కీ లాటరీలో వచ్చిన విధంగా దుకాణాలు ఏర్పాటు చేసుకునేవారు. నిబంధనల సడలింపు వ్యాపారులకు కొంత ఉపశమనం కలిగించే పరిణామం. ఇదిలా ఉండగా చలాన్‌లో సైతం జిల్లా పేరు తీసి వేయడంతో ఒక్క చలాన్‌తో రాష్ట్రంలో ఎక్కడైనా వేసుకునే అవకాశం కల్పించారు.

83 దరఖాస్తులే..

జిల్లాలో 50 మద్యం దుకాణాలకుగాను టెండర్లను స్వీకరిస్తున్నారు. గతనెల 26వ తేదీన ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదల కాగా, ఈనెల 18వ తేదీతో గడువు ముగియనుంది. 2023-25 సంవత్సరంలో జిల్లాలో 2,492 దరఖాస్తులు రాగా, రూ.50కోట్ల మేర ఆదాయం సమకూరింది. ఈసారి జరిగే 2025-27 రెండేళ్ల కాలపరిమితిలో టెండర్లలో 3వేలకు పైగా దరఖాస్తులు వస్తాయని ఎక్సైజ్ శాఖ అంచనాలు వేసుకుంది. టెండర్ల నోటిఫికేషన్ విడుదల చేసి 20 రోజులు గడిచిపోతున్నా, జిల్లాలో కేవలం 83 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. ఇందులో జనగామ సర్కిల్‌లో 38, స్టేషన్‌ఘన్‌పూర్‌లో 27, పాలకుర్తిలో 18 మంది టెండర్లు దాఖలు చేశారు. పాలకుర్తి-5, జనగామ-10, స్టేషన్ ఘన్‌పూర్‌లో ని-8 దుకాణాలకు ఇంకా బోనీ కాలేదు. టెండరుదారులు మాత్రం ఆచితూచి అడుగులు వేస్తున్నారు.

ఆశాభావంలో ఎక్సైజ్ శాఖ

మద్యం దుకాణాలకు మూడు రోజులు సమయమే ఉండడంతో చివరి నిమిషాల్లో భారీగా టెండర్లు వచ్చే అవకాశం ఉందని ఎక్సైజ్ అధికారులు భావిస్తున్నారు. చాలామంది వ్యాపారులకు చివరి రోజుల్లోనే టెండర్లు వేయడం ఆనవాయితీ. గతంలోనూ అలానే జరిగిందని జిల్లా ఎక్సైజ్ అధికారులు అంటున్నారు. ప్రస్తుత టెండర్ల మందగమనం ప్రభుత్వానికి ఆర్థికంగా పెద్ద సవాలుగా మారింది. మద్యం టెండర్లు ప్రభుత్వం ఆదాయానికి ముఖ్యమైన వనరు కావడంతో, చివరి మూడు రోజుల్లో వ్యాపారులు ముందుకు రావాలని అధికారులు ఎదురుచూస్తున్నారు.

కాంతమ్మకు నివాళి..



కాంతమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పించి మాధవరెడ్డిని పరామర్శిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రి పొంగులేటి

నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి తల్లి దొంతి కాంతమ్మకు బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి నివాళులర్పించారు. కాజీపేట ప్రశాంత్ నగర్ సమీపంలోని పీజీఆర్ గార్డెన్‌లో మాత యజ్ఞం కార్యక్రమాన్ని నిర్వహించగా సీఎంతోపాటు మంత్రులు, ఉమ్మడిజిల్లా ఎమ్మెల్యేలు హాజరయ్యారు. ముందుగా కాంతమ్మ చిత్రపటం వద్ద పూలు చల్లి మాధవరెడ్డిని పరామర్శించారు. అంతకు ముందు సీఎంకు ప్రజాప్రతినిధులు, అధికారులు ఘన స్వాగతం పలికారు.

- సాక్షిప్రతినిధి, వరంగల్

-10లో▸

ఆలయాల భూములను కాపాడాలి

- స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



సమీక్షలో మాట్లాడుతున్న కడియం శ్రీహరి, చిత్రంలో కలెక్టర్ రిజ్వాన్ బాషా

జనగామ రూరల్: ఆలయాల భూములను కాపాడాలని భక్తులకు మెరుగైన సదుపాయాలను కల్పించాలని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి సూచించారు. బుధవారం స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ పరిధిలోని ప్రధాన ఆలయాలపై కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా, ఎండోమెంట్ జాయింట్ కమిషనర్ రామకృష్ణారావుతో కలిసి దేవస్థానాల చైర్మన్లు, ఈఓ, రెవెన్యూ, ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కడియం మాట్లాడుతూ.. నియోజకవర్గ పరిధిలో గల ఆరు దేవస్థానాల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలన్నారు. జీడికల్ రామచంద్రస్వామి, చిల్పూర్ బుగులు వెంకటేశ్వరస్వామి, స్టేషన్ ఘన్‌పూర్ తిరుమలనాథస్వామి, నవాబ్‌పేట కోదండరామస్వామి, చిన్నపెండ్యాల లక్ష్మీనరసింహస్వామి, జఫర్‌గడ్ లక్ష్మీనరసింహస్వామి ఆలయాలను పర్యవేక్షించాలన్నారు. నవంబర్ 10వ తేదీన జరిగే జీడికల్ లక్ష్మీ నర్సింహస్వామి కల్యాణాన్ని పురస్కరించుకొని తగు ఏర్పాట్లు చేయాలన్నారు.

భక్తులు ఉండేందుకు మౌలిక సదుపాయాలు రూమ్ లను నిర్మించాలన్నారు. అనంతరం కలెక్టర్ రిజ్వాన్ బాషా మాట్లాడుతూ.. దేవాలయాల భూములను త్వరగా సర్వే చేసి ఎండోమెంట్ అధికారులతో కోఆర్డినేట్ చేసుకొని హద్దులను ఏర్పాటు చేయాలని తహసీల్దార్లకు ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో ఆర్డీఓలు గోపీరామ్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు కొనసాగించాలి..

జిల్లా కేంద్రంలోని గ్రీన్ మార్కెట్ లోపల పత్తి యార్డు కోసం నిర్మించిన స్థలంలో రెండు ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను యథావిధిగా కొనసాగించాలని కోరుతూ తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి భూక్య చందూనాయక్ కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషాకు బుధవారం వినతిపత్రం అందజేశారు. గతంలో మార్కెట్ యార్డు బయట ధాన్యం కొనుగోలు కేంద్రాలను నిర్వహించడం వల్ల రైతుల ధాన్యాన్ని పెద్దఎత్తున దొంగలు ఎత్తుకెళ్లడం జరిగిందన్నారు.

ధాన్యం కొనుగోళ్లకు సిద్ధంగా ఉండాలి

- వీసీలో కలెక్టర్లకు మంత్రులు తుమ్మల, ఉత్తమ్ ఆదేశం

జనగామ రూరల్: ధాన్యం కొనుగోళ్లకు అధికారులు తగు ఏర్పాట్లు చేపట్టి, సిద్ధంగా ఉండాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆదేశించారు. బుధవారం ధాన్యం కొనుగోళ్లపై హైదరాబాద్ నుంచి కలెక్టర్లు, వ్యవసాయ, సంబంధిత శాఖల అధికారులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా దిశానిర్దేశం చేశారు. ఈ వీసీకి కలెక్టరేట్ నుంచి కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్ బెన్ షాలోమ్, ఆర్డీఓలు, సివిల్ సప్లై, మార్కెటింగ్ అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. ప్రభుత్వ ఎంఎస్పీ, బోనస్ అందించడానికి సిద్ధంగా ఉందని, అందుకు అనుగుణంగా కొనుగోలు కేంద్రాల్లో సకాలంలో ట్యాబ్ ఎంట్రీ జరిగేలా చూడాలని ఆదేశించారు. మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ.. ఇప్పటి వరకు పద్ధతి ప్రకారం, ఎలాటి సమస్యలు లేకుండా ధాన్యం కొనుగోలు చేశామన్నారు. వీసీ అనంతరం కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అధికారులతో మాట్లాడుతూ.. జిల్లాలో పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలన్నారు. ప్రతీ కేంద్రంలో కనీస వసతులతో పాటు సరిపడా గన్నీ బ్యాగ్‌లు, టార్పాలిన్,, తేమ కొలిచే యంత్రాలు అందుబాటులో ఉండాలన్నారు.

క్లుప్తంగా

బీసీ జేఏసీ ఉమ్మడి వరంగల్ జిల్లా కమిటీ

హన్మకొండ: తెలంగాణ రాష్ట్ర బీసీ జేఏసీ ఉమ్మడి వరంగల్ జిల్లా కమిటీని ఏర్పాటు చేశారు. బుధవారం హనుమకొండ నయీంనగర్‌లో జరిగిన బీసీ సంఘాల సమావేశంలో కమిటీని ఏర్పాటు చేశారు. ఇప్పటికే ఉమ్మడి వరంగల్ జిల్లా చైర్మన్‌గా వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్‌ను రాష్ట్ర కమిటీ ప్రకటించింది. కాగా, వర్కింగ్ చైర్మన్‌గా దొడ్డిపల్లి రఘుపతి, వైస్ చైర్మన్లుగా దాడి మల్లయ్య, బొనగాని యాదగిరి గౌడ్, వైద్యం రాజగోపాల్, తమ్మెల శోభారాణి, కోఆర్డినేటర్లుగా తంగళ్లపల్లి రమేశ్, గాజ యుగంధర్ యాదవ్‌తో కమిటీ ఏర్పాటైందని చైర్మన్ వేణుగోపాల్ గౌడ్ తెలిపారు. ఈ నెల 18న నిర్వహించనున్న రాష్ట్ర బీసీ బంద్‌ను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఖానాపురం: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని అశోక్‌నగర్‌లో చోటుచేసుకుంది. హెడ్‌కానిస్టేబుల్ జంపయ్య కథనం ప్రకారం.. నర్సంపేట మండలం ఇటుకాలపల్లి జీపీ పరిధిలోని నర్సింగాపురం గ్రామానికి చెందిన పల్లకొండ రాజేందర్(43) బైక్‌పై మంగళవారం రాత్రి ఖానాపురం మండలం అశోక్‌నగర్‌లో బంధువుల ఇంటికి బయలుదేరాడు. మార్గమధ్యలో సైనిక్‌స్కూల్ దాటిన తర్వాత బైక్ రోడ్డు పక్కన ఉన్న గుంతలో పడింది. గమనించిన వాహనదారులు క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య సునీత, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి కుమారుడు అభిషేక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ జంపయ్య తెలిపారు.

బైక్‌లు ఢీకొని దొడ్లగడ్డ తండాలో చిన్నారి ..

నర్మెట: రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఓ చిన్నారి మృతి చెందింది. ఈ ఘటన బుధవారం మండలంలోని దొడ్లగడ్డ తండాలో చోటు చేసుకుంది. తరిగొప్పులకు చెందిన చెన్నబోయిన శివుడు తన భార్య శైలజ, కూతురు శ్రీవిద్య(03)తో కలిసి బైక్‌పై జనగామ నుంచి తరిగొప్పులకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న మరో బైక్ మండలంలోని దొడ్లగడ్డ తండాలో వీరిని ఢీకొంది. ఈ ఘటనలో శ్రీవిద్యకు తీవ్రగాయాలయ్యాయి. దీంతో 108లో జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించగా చిన్నారి అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు.



చిన్నారిని 108లో ఆస్పత్రికి తరలిస్తున్న సిబ్బంది

దరఖాస్తు చేసుకోవాలి

కాశీబుగ్గ సెంటర్: విద్యాశాఖలోని బోధన, బోధనేతర ఇబ్బందికి జీఓ 317 ప్రకారం ఇంటర్ లోకల్ క్యాడర్ తాత్కాలిక బదిలీలు, డిప్యూటేషన్ల కోసం ఈనెల 17 నుంచి 24 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ డాక్టర్ ఇ.నవీన్‌నికోలస్ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. schooledu.telangana.gov.inలో దరఖాస్తు చేసి సంబంధిత కాపీలను ఆర్‌జేడీ, డీఈఓలకు సమర్పించాలని పేర్కొన్నారు. వివరాల కోసం 8523030307 సంప్రదించాలని సూచించారు.

ఇన్‌చార్జ్‌లుగా పదోన్నతి..?

- పూర్తిస్థాయి పదోన్నతికి అడ్డంకిగా హైకోర్టులో కేసు
- ఖాళీగా ఉన్నతస్థాయి ఉద్యోగాలు

టీజీ ఎన్పీడీసీఎల్‌లో పోస్టుల కల్పనకు యాజమాన్యం సన్నద్ధం

హన్మకొండ : తెలంగాణ నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (టీజీ ఎన్పీడీసీఎల్)లో పదోన్నతుల కల్పనకు యాజమాన్యం సన్నద్ధమైనట్లు తెలుస్తోంది. పదోన్నతి అంశంపై హైకోర్టులో కేసు విచారణలో ఉండడంతో పాలన పరమైన ఇబ్బందులు తలెత్తుతున్నాయి. రెండేళ్ల నుంచి ఉన్నతస్థాయి పదోన్నతులకు అధికారులు సైతం ఎదురుచూస్తున్నారు. బీసీ, ఓసీ ఉద్యోగ సంఘాలు హైకోర్టుకు వెళ్లడంతో ఎలాంటి పదోన్నతి కల్పించకుండా స్టే రావడంతో తాత్కాలిక పదోన్నతి ప్రక్రియకు ఆటంకం కలిగింది. ఎస్సీ, ఎస్టీలకు వారి రిజర్వేషన్ కోటాకు మించి పదోన్నతి పొందారని, తమకు అన్యాయం జరుగుతోందని, రిజర్వేషన్ల ప్రక్రియ సమీక్షించి న్యాయం చేయాలని కోరుతూ బీసీ, ఓసీ ఉద్యోగ సంఘాలు హైకోర్టును ఆశ్రయించాయి. ఈ కేసు విచారణలో ఉండగా తాత్కాలిక పదోన్నతి కల్పిస్తుండడంతో బీసీ, ఓసీ ఉద్యోగ సంఘాలు మరోసారి హైకోర్టును ఆశ్రయించగా స్టే ఇచ్చింది. హైకోర్టు తీర్పు ఆలస్యమవుతుండడంతో పదోన్నతి ద్వారా భర్తీ చేయాల్సిన ఉన్నత స్థానాల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో పాలనపరమైన సమస్యలు ఏర్పడుతున్నాయి. మరో వైపు సీనియర్లు పదోన్నతి వైపు ఎదురుచూస్తు యాజమాన్యంపై ఒత్తిడి తెస్తున్నారు. ఈ క్రమంలో ఇన్‌చార్జ్ పదోన్నతి కల్పించాలని విద్యుత్ సంస్థల యాజమాన్యాలు నిర్ణయం తీసుకున్నారు. ఇందులో భాగంగా ఎన్పీడీసీఎల్‌లో ఇన్‌చార్జ్ పదోన్నతి కల్పించేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నట్లు సమాచారం. టీజీ ఎన్పీడీసీఎల్, ఎస్పీడీసీఎల్‌లో ఒకేసారి పదోన్నతి ఉత్తర్వులు అందించాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలిసింది.



పెరిగిన పోస్టులు..

టీజీ ఎన్పీడీసీఎల్‌లో ఏళ్లుగా వినియోగంలో లేని 216 అన్‌యూజ్డ్ పోస్టులు, ఖాళీగా ఉంటున్న 217 జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్ పోస్టులను ప్రభుత్వం రద్దు చేసి నూతనంగా 339 పోస్టులను మంజూరు చేసింది. దీంతో కొత్తగా రెండు చీఫ్ ఇంజనీర్, ఒక జాయింట్ సెక్రటరీ, సూపరింటెండ్ పోస్టులు 4, జనరల్ మేనేజర్ ఒక పోస్టు, డివిజనల్ ఇంజనీర్ పోస్టులు 4, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ పోస్టులు 4, అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ పోస్టులు 6, అకౌంట్స్ ఆఫీసర్ ఒక పోస్టు, అసిస్టెంట్ అకౌంట్ రెండు పోస్టు, పర్సనల్ ఆఫీసర్ 4, సబ్ ఇంజనీర్ 16 పోస్టులు, అసిస్టెంట్ ఇంజనీర్ 16, జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ 20, సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్ 32, సీనియర్ అసిస్టెంట్ 88, అసిస్టెంట్ లైన్‌మెన్ 48, ఆఫీస్ సబార్డినేట్ 80, వాచ్‌మెన్ 4, స్వీపర్ కమ్ గార్డెనర్, స్వీపర్, శానిటరీ ఆర్డర్లీస్ 6 పోస్టులు మంజూరయ్యాయి. ఇంజనీరింగ్ విభాగంలో భారీగా పదోన్నతులు పొందే అవకాశాలు కన్పిస్తున్నాయి. ఎస్ఈలు నలుగురికి చీఫ్ ఇంజనీర్‌గా, ఐదునుంచి ఏడుగురు డీఈలకు ఎస్ఈలుగా, ఏడీఈలకు 7నుంచి 10మందికి డివిజన్ ఇంజనీర్లుగా, ఏఈలు 80 నుంచి 90 వరకు అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్లుగా పదోన్నతి లభించనుంది. వీటితో పాటు సబ్ ఇంజనీర్లకు ఏఈఈలుగా, సీనియర్ అసిస్టెంట్లకు జేపీఓలుగా, లైన్ ఇన్‌స్పెక్టర్లకు సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్లుగా, జూనియర్ అసిస్టెంట్లకు సీనియర్ అసిస్టెంట్లుగా, పర్సనల్ ఆఫీసర్లకు అసిస్టెంట్ సెక్రటరీలుగా, అదే విధంగా అకౌంట్స్ విభాగంలోనూ పదోన్నతులు కల్పించనున్నారు. ఈ మేరకు ఎన్పీడీసీఎల్ మానవ వనరుల విభాగం ఇప్పటికే సీనియారిటీ, ఆర్ఓఆర్ ప్రకారం ఉద్యోగాల వారీగా పదోన్నతి జాబితా సిద్ధం చేసినట్లు సమాచారం. ఈ వారంలో ఎప్పుడైనా ఇన్‌చార్జ్ పదోన్నతుల ఉత్తర్వుల వెలువడే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి.

క్రీడాపండుగకు వేళాయె..

- నేటి నుంచి నేషనల్ అథ్లెటిక్స్ మీట్
- హాజరుకానున్న 937 అథ్లెట్లు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అసోసియేషన్ బాధ్యులు

వరంగల్ స్పోర్ట్స్: క్రీడాపండుగకు వేళ అయ్యింది. హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న 5వ ఓపెన్ నేషనల్ అండర్–23 అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ గురువారం నుంచి ప్రారంభంకానుంది. ఈ నేపథ్యంలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్ చైర్మన్ ఎర్రబెల్లి వరదరాజేశ్వర్‌రావు తెలిపారు. హనుమకొండ జేఎన్ స్టేడియంలోని డీఎస్ఏ ఆఫీస్‌లో బుధవారం చాంపియన్‌షిప్ వివరాలు విలేకరులకు వెల్లడించారు. నేటి నుంచి (16 నుంచి 18వ తేదీ వరకు) మూడు రోజుల పాటు జరుగనున్న అథ్లెటిక్స్ పోటీల్లో దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి 937 మంది అథ్లెట్లు, 150 మంది టెక్నికల్ అఫీషియల్స్ పాల్గొంటారని తెలిపారు. అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నుంచి 25 మంది, 70మంది రాష్ట్ర సాంకేతిక అధికారులు, 25 మంది స్థానిక అధికారులు, 50మంది వలంటీర్లు పాల్గొంటారని వెల్లడించారు.



వివరాలు వెల్లడిస్తున్న తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్ చైర్మన్ వరదరాజేశ్వర్‌రావు

చాంపియన్‌షిప్‌లో ప్రతీ ఈవెంట్ యూట్యూబ్‌లో ప్రత్యక్ష ప్రసారం అవుతుందని, వివిధ ప్రదేశాల నుంచి డ్రాఫ్ట్ చేసిన టెక్నికల్ అఫీషియల్స్, ఏఎఫ్ఐ, ఫొటో ఫినిష్ అధికారులు, లైవ్ స్ట్రీమింగ్ బృందానికి హోటల్ వసతి కల్పించనున్నట్లు తెలిపారు. ఉదయం 10 గంటలకు వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య , హనుమకొండ, వరంగల్ కలెక్టర్లు స్నేహాశబరీష్, సత్యశారద, మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్, 'కుడా' చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డి అతిథులుగా హాజరై పోటీలను ప్రారంభిస్తారని తెలిపారు. సమావేశంలో హనుమకొండ డీవైఎస్‌ఓ గుగులోత్ అశోక్‌కుమార్, అథ్లెటిక్స్ సంఘం జిలా కార్యదర్శి సారంగపాణి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతికి కారణమైన వ్యక్తికి జైలు

రఘునాథపల్లి: రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతికి కారణమైన ఓ వ్యక్తికి ఆరు నెలల జైలు శిక్షతోపాటు రూ. 3వేలు జరిమానా విధిస్తూ బుధవారం కోర్టు తీర్పు వెలువరించిందని ఎస్సై నరేశ్‌యాదవ్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. నర్మెట మండలం మల్కాపేటకు చెందిన లకావత్ శంకర్, తన తండ్రి చంద్రు బైక్‌పై 2020, డిసెంబర్ 07న రఘునాథపల్లికి వస్తున్నారు. ఎర్రగడ్డతండా సమీపంలో మంగళిబండతండాకు చెందిన భూక్య జగన్ బైక్‌పై వస్తూ ఎదురుగా శంకర్ బైక్‌ను ఢీకొనడంతో తండ్రి,కుమారుడికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు గుర్తించి జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ చంద్రు మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై అశోక్‌కుమార్ కేసు నమోదు చేసి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేయగా ప్రస్తుత ఎస్సై నరేశ్, కోర్టు కానిస్టేబుల్ వెంకటేష్, కానిస్టేబుల్ సాయికృష్ణ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. ఫిర్యాదుదారు తరఫున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కిరణ్‌కుమార్ వాదనలు వినిపించారు. ఈ ఘటనలో నేరం రుజువుకావడంతో జగన్‌కు ఆరు నెలల జైలు శిక్షతోపాటు రూ. 3వేలు జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు వెలువరించిందని ఎస్సై తెలిపారు.

పాత కార్లతో జాగ్రత్త..!

- ధర తక్కువ అనుకుంటే పొరపాటే..
- మన ఆసక్తే మోసానికి ఆయుధం
- అన్ని పత్రాలు సరిచూసుకోవాలంటున్న అధికారులు

ఖిలా వరంగల్ : ఢిల్లీ వంటి మహా నగరాల్లో కాలుష్యం అధికమవడంతో పదిహేనేళ్లు దాటిన కార్లు, ట్యాక్సీలపై ఆంక్షలు విధిస్తున్నారు. ఈ తరుణంలో డీజిల్, పెట్రోల్ కార్ల అమ్మకాలు గణనీయంగా పెరిగాయి. వీటి విక్రయాలకు అక్కడ ప్రత్యేక మార్కెట్లు ఉంటాయి. కాగా,ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలువురు వ్యాపారులు తక్కువ ధరకు వాటిని అక్కడ కొనుగోలు చేసి సెకండ్ హ్యాండ్ కార్లంటూ విక్రయిస్తున్నారు. వరంగల్ నగరంలో రకరకాల పేర్లతో సుమారు 20 వరకు పాత కార్ల దుకాణాలు ఉన్నాయి. ఏటా సుమారు 1,500 నుంచి 2వేల లోపు కార్లు విక్రయాలు సాగుతున్నాయి. ఇవి కాక తెలిసిన వారు, మధ్యవర్తుల సహకారంతో తెచ్చుకునేవి మరో 1,000 వరకు ఉంటాయని తెలుస్తోంది.

ధ్రువీకరణ పత్రాలు కీలకం..



వాహనం కొనుగోలు చేసే ముందు ఆర్‌సీ, బీమా, కాలుష్య నియంత్రణ ధ్రువీకరణ పత్రాలు అఫిడవిట్ తీసుకోవాలి. వాహనంపై ఎలాంటి కేసులు లేవని పోలీసు శాఖ నుంచి ధ్రువీకరణ పత్రం పొందాలి. ఎన్‌ఓసీ పొందిన 15 రోజుల లోపు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. లేదంటే నెలవారీగా జరిమానా విధిస్తారు. వాహన కాల పరిమితి 15 ఏళ్లు, మోడల్, కంపెనీ(ఇన్వాయిస్) ధరను బట్టి రోడ్ ట్యాక్స్ విధిస్తారు. ఇంజిన్ ఆన్ చేసే సమయంలో ఆయిల్ పైకి ఎగజిమ్మినా లీకైనా, పొగవచ్చినా ప్రమాదమని గుర్తించాలి. గేర్ ఇంజిన్ సరి చూసుకోవాలి. టైర్లు సరిగా లేకపోతే మైలేజీ తగ్గుతుంది.

వాహనాన్ని పసిగట్టొచ్చిలా..

వాహన అద్దాల చివర కంపెనీ పేరు, ఏడాది సంఖ్య ముద్రించి లేకపోతే మార్చారని గ్రహించాలి. డోర్ బాటమ్ ప్రాంతంలో రబ్బర్లు తీసి వాటిపై గుండీల ఆకారంలో అచ్చులుంటే ఎలాంటి మార్పు చేయలేదని అర్థం. కాళ్ల కింద డిక్కీ ప్రాంతంలో మ్యాట్‌లు ఎత్తి కింది వైపు దెబ్బతిందో లేదో చూసుకోవాలి. ప్రమాదం జరిగిన వాహనాలకు రంగులు వేసి బఫింగ్ చేస్తే పోల్చుకోవడం కష్టమవుతుంది.

ఒరిజినల్ పత్రాలు ఉంటేనే..



ఢిల్లీతో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన కార్లను కొనుగోలు చేసే సమయంలో జాగ్రత్తలు అవసరం. వాహనానికి సంబంధించిన అన్ని ఒరిజనల్ పత్రాలను సరిచూసుకోవాలి. పాత వాహనాలపై కేసులు లేకుండా చూసుకోవాలి. వాహనం వెంట ఎన్‌ఓసీ తప్పనిసరిగా ఉండాలి. కండీషన్ బట్టి కొనుగోలు చేసేటప్పుడు నిపుణులను వెంట తీసుకెళ్లి కొనుగోలు చేయాలి.

– జి. సురేశ్ రెడ్డి, డీటీసీ వరంగల్, హనుమకొండ

సీఎం రేవంత్‌రెడ్డికి ఘనస్వాగతం



హెలిపాడ్‌వద్ద సీఎం రేవంత్‌రెడ్డితో మంత్రి లక్ష్మణ్‌కుమార్, ఎంపీలు బలరాంనాయక్, కావ్య, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు

- హెలిపాడ్ వద్ద మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు
- మాతృయజ్ఞం వద్ద అందరిని పలకరించిన సీఎం రేవంత్‌రెడ్డి..
- స్వాగతం, వీడ్కోలు సందర్భంగా కుశల ప్రశ్నలు..
- మంత్రులతో కలిసి ఎమ్మెల్యే మాధవరెడ్డికి సీఎం పరామర్శ

సాక్షిప్రతినిధి, వరంగల్/కాజీపేట : వరంగల్ జిల్లా నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని పరామర్శించేందుకు హనుమకొండకు వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, అధికారులు ఘనస్వాగతం పలికారు. ఎమ్మెల్యే మాధవరెడ్డి తల్లి కాంతమ్మ ఇటీవల మృతి చెందగా కాజీపేట ప్రశాంత్ నగర్ సమీపంలోని పీజీఆర్ గార్డెన్‌లో బుధవారం మాతృయజ్ఞం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి హైదరాబాద్ నుంచి హెలికాప్టర్ ద్వారా హనుమకొండకు వచ్చారు. ఈ సందర్భంగా సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలోని హెలిపాడ్ వద్ద సీఎం రేవంత్‌రెడ్డికి పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, విప్ రాంచందర్‌నాయక్, ఎంపీలు పోరిక బలరాం నాయక్, డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్ రెడ్డి, రేవూరి ప్రకాశ్ రెడ్డి, యశస్విని రెడ్డి, కేఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణరావు, హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు స్నేహ శబరీష్, డాక్టర్ సత్య శారద, వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్, టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి, గ్రేటర్ మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్, పలువురు కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు పుష్పగుచ్ఛాలు అందించి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆర్ట్స్ కళాశాల మైదానం నుంచి రోడ్డు మార్గంలో పీజీఆర్ గార్డెన్‌లో కాంతమ్మ మాతృయజ్ఞం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంతమ్మ చిత్రపటం వద్ద పూలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాధవరెడ్డి, తన కుటుంబ సభ్యులను పరామర్శించిన సీఎం రేవంత్.. తిరిగి హైదరాబాద్ వెళ్లారు. కాగా, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి స్వాగతం, వీడ్కోలు సందర్భంగా ప్రజాప్రతినిధులు, అధికారులు పలువురు ఆయనను కలవగా, అందరినీ పేరుపేరున పలకరించి కుశలప్రశ్నలు వేశారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా పోలీసులు భారీభద్రత, బందోబస్తు ఏర్పాటు చేశారు.

బ్యాటరీ దొంగల ముఠా అరెస్టు

- వివరాలు వెల్లడించిన ఏసీపీ రవీందర్‌రెడ్డి

నర్సంపేట రూరల్ : బ్యాటరీ దొంగల ముఠాను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు నర్సంపేట ఏసీపీ రవీందర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం నర్సంపేట పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. పాలకుర్తికి చెందిన గుంజే సంపత్, గుంజే ప్రశాంత్, జఫర్‌గఢ్ మండలం తీగారం గ్రామానికి చెందిన గండికోట మహేశ్, బోసు సాంబరాజు ముఠాగా ఏర్పడ్డారు. నర్సంపేట మండలంలోని పలుగ్రామాల్లో అర్ధరాత్రి సమయంలో సోలార్ విద్యుత్ దీపాలకు ఉన్న బ్యాటరీలను అపహరిస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం తెల్లవారుజామున రాజుపేటలో బ్యాటరీలు చోరీ చేసేందుకు అనుమానాస్పదంగా తిరుగుతున్న వీరిని పోలీసులు అదుపులోకి తీసుకుని తనిఖీ చేశారు. ఇందులో రూ. 2.15 లక్షల విలువైన 38 బ్యాటరీలు లభించగా స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నలుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ తెలిపారు. నర్సంపేట టౌన్ సీఐ రఘుపతిరెడ్డి, ఎస్సైలు రవికుమార్, గూడ అరుణ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



బ్యాటరీ దొంగల అరెస్టును చూపుతున్న ఏసీపీ రవీందర్‌రెడ్డి

ముగ్గురు నకిలీ వైద్యులపై క్రిమినల్ కేసు

స్టేషన్‌ఘన్‌పూర్: స్టేషన్‌ఘన్‌పూర్ మున్సిపాలిటీ పరిధి శివునిపల్లిలో ముగ్గురు నకిలీ వైద్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు తెలంగాణ మెడికల్ కౌన్సిల్ పబ్లిక్ రిలేషన్స్ కమిటీ సభ్యుడు వి.నరేశ్, యాంటీ క్వాకరీ కమిటీ అధ్యక్షుడు అన్వర్ మియా, హెచ్‌ఆర్‌డీఏ అధ్యక్షుడు కె.వెంకటస్వామి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శివునిపల్లిలో ఆగస్టు 30న టీఎంసీ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టి ఎలాంటి అర్హత లేకున్నా ఆర్‌ఎంపీలుగా చలామణి అవుతూ రోగులకు వైద్యం చేస్తున్నట్లు గుర్తించి పి.సదానందం, పి.సంపత్, సీహెచ్.విద్యాసాగర్‌పై క్రిమినల్‌కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. సదానందం, సంపత్ సోదరులు పదో తరగతి కూడా పూర్తి చేయకుండా వైద్యులుగా చలామణి అవుతూ తెలిసీతెలియని వైద్యం చేస్తూ అమాయకుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారన్నారు. అలాగే, విద్యాసాగర్ అనే వ్యక్తి నాగరాజు మెడికల్ స్టోర్స్‌లో అర్హత లేకుండా ఆధునిక వైద్యం పేరుతో రోగులకు యాంటీబయాటిక్స్, స్టెరాయిడ్లు, ఇంజెక్షన్లు చేస్తున్నాడని తెలిపారు. దీంతో ఈ ముగ్గురిపై క్రిమినల్ కేసులు నమోదు చేశామన్నారు. నకిలీ వైద్యుల సమాచారంపై ప్రజలు తెలంగాణ మెడికల్ కౌన్సిల్‌కు 9154382727 నంబర్‌కు వాట్సాప్ ద్వారా సమాచారం అందించాలని వారు సూచించారు.

సీపీఆర్‌తో మనిషిని బతికించే అవకాశం

- కేఎంసీ స్కిల్ సెంటర్ నోడల్ ఆఫీసర్ మురళి

ఎంజీఎం: అత్యవసర పరిస్థితుల్లో సీపీఆర్ వెంటనే చేయడం ద్వారా మనిషిని బతికించే అవకాశాలు పెరుగుతాయని కేఎంసీ స్కిల్ సెంటర్ నోడల్ ఆఫీసర్ చిలక మురళి అన్నారు. సీపీఆర్ వారోత్సవాల్లో భాగంగా కేఎంసీలోని సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో బుధవారం సీపీఆర్‌పై అవగాహన నిర్వహించారు. ఈసందర్భంగా హాస్పిటల్‌లో ఉన్న అన్ని తరగతుల ఉద్యోగులు, పేషెంట్ బంధువులు, ఆటో డ్రైవర్లకు సీపీఆర్‌పై శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ అనిల్ బాలరాజు, ఆర్ఎంఓ ప్రతాప్, డాక్టర్ రోషన్, అనస్తీషియా అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీనివాస్ నాయక్, డాక్టర్ కరిష్మా తదితరులు పాల్గొన్నారు.



సీపీఆర్‌పై శిక్షణ ఇస్తున్న వైద్యులు

విద్యార్థులు నైపుణ్యాలు పెంచుకోవాలి

విద్యారణ్యపురి: విద్యార్థులు కంప్యూటర్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు సంబంధించిన నైపుణ్యాలను పెంచుకోవాలని, తద్వారా ఉపాధి, ఉద్యోగావకాశాలు లభిస్తాయని హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ గుర్రం శ్రీనివాస్ తెలిపారు. కళాశాలలో కెరీర్ గైడెన్స్ సెల్, కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో స్కిల్ ఇండియా డిజిటల్ పోటీల ఉచిత కోర్సులపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వరంగల్, హనుమకొండ స్కిల్ ఇండియా హబ్ డిస్ట్రిక్ట్ ప్రాజెక్టు మేనేజర్ హరీశ్, శ్రావణి పాల్గొని స్కిల్ ఇండియా కార్యక్రమాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సమావేశంలో వైస్ ప్రిన్సిపాల్ రజనీలత, కెరీర్ గైడెన్స్ సెల్ కన్వీనర్ డాక్టర్ యాకూబ్, కామర్స్ విభాగం అధిపతి డాక్టర్ జె.చిన్నా, అధ్యాపకులు బైరి శ్రీనివాస్, ఉమాదేవి, శివనాగ శ్రీను, అనిల్‌కుమార్, గంగిశెట్టి శ్రీనివాస్, నవీన్, బాలచందర్, మాధవ్ శంకర్, వందన, సునీత తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్రీనివాస్

విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలి

హన్మకొండ: వినియోగదారులకు అంతరాయాలు లేని మెరుగైన, నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని అధికారులు, ఉద్యోగులకు టీజీ ఎన్పీడీసీఎల్ ఆపరేషన్ డైరెక్టర్ టి.మధుసూదన్ సూచించారు. హనుమకొండ పెద్దమ్మగడ్డలోని ఎన్పీడీసీఎల్ వరంగల్ సర్కిల్ కార్యాలయంలో సర్కిల్ స్థాయి సమీక్ష సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ అంతరాయాలు, బ్రేక్ డౌన్స్‌పై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ప్రధానంగా వ్యవసాయానికి అంతరాయాలు లేని విద్యుత్ అందించాలని చెప్పారు. రెవెన్యూ వసూళ్ల వందశాతం సాధించాలన్నారు. సమావేశంలో ఆపరేషన్ –2 సీజీఎం రాజు చౌహాన్, వరంగల్ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ కె.గౌతంరెడ్డి, డీఈలు ఎ.ఆనందం, ఎస్.మల్లికార్జున్, తిరుపతి, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ సంజీవరావు, ఏడీఈ, ఏఈలు, ఏఏఓ, జేఏఓలు, ఉద్యోగులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మధుసూదన్

ఆత్మహత్యకు యత్నించిన యువకుడిని కాపాడిన పోలీసులు

ఖిలా వరంగల్: వరంగల్ ఎస్ఆర్ఆర్‌తోట చిన్న బ్రిడ్జి వద్ద బుధవారం మధ్యాహ్నం ఓ యువకుడు రైలు కింద పడి ఆత్మహత్యకు యత్నించాడు. సమాచారం అందుకున్న హెడ్‌కానిస్టేబుల్ ఇస్మాయిల్.. అతడిని పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఓ యువకుడు ట్రాక్‌పై ఆత్మహత్యకు యత్నిస్తున్నట్లు డయల్ 100కు కాల్‌రాగా.. మిల్స్‌కాలనీ హెడ్‌కానిస్టేబుల్ ఇస్మాయిల్ క్షణాల్లో ఘటనాస్థలికి చేరుకున్నారు. మద్యం మత్తులో పట్టాలపై తిరుగుతున్న యువకుడిని క్షేమంగా పట్టుకుని వివరాలు సేకరించి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కాగా, ఆత్మహత్యకు యత్నించిన యువకుడిని కాపాడిన హెడ్ కానిస్టేబుల్ ఇస్మాయిల్, కానిస్టేబుల్ నరేశ్‌ను ఇన్‌స్పెక్టర్ రమేశ్ అభినందించారు.



ఆత్మహత్యకు యత్నించిన యువకుడిని తీసుకొస్తున్న హెడ్‌కానిస్టేబుల్ ఇస్మాయిల్

అమ్మవారికి ఏఐసీసీ పరిశీలకుడు నవజ్యోతి పట్నాయక్ పూజలు



అమ్మవారికి పూజలు చేస్తున్న నవజ్యోతి పట్నాయక్, తదితరులు

హన్మకొండ కల్చరల్: నగరంలోని భద్రకాళి, వేయిస్తంభాల దేవాలయాలను ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ పరిశీలకుడు నవజ్యోతి పట్నాయక్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా ఆలయాల్లో ప్రత్యేకపూజలు నిర్వహించారు. వేదపండితుడు గంగు మణికంఠ తీర్థప్రసాదాలు అందజేసి అమ్మవారి శేషవస్త్రాలతో సన్మానించారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఈవీ శ్రీనివాస్‌రావు, టీపీసీసీ పరిశీలకుడు ఆదర్శ్ జైస్వాల్, నాయకులు దేవ్‌ప్రసాద్, విక్రమ్ పాల్గొన్నారు.

ఎక్స్‌పోజర్ విజిట్‌కు దరఖాస్తుల ఆహ్వానం

విద్యారణ్యపురి: అంతర్జాతీయ ఎక్స్‌పోజర్ విజిట్ అండ్ ఎడ్యుకేషన్ ఎక్ఛేంజ్ ప్రోగ్రామ్‌కు ప్రభుత్వం ప్రతీ జిల్లా నుంచి ముగ్గురు ఉపాధ్యాయులను పంపనుంది. సింగపూర్, ఫిన్లాండ్, వియత్నాం, జపాన్ దేశాల్లో ఎక్స్‌పోజర్ టూర్ కొనసాగనుంది. ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసి వివరాలు పంపాలని డీఈఓలకు విద్యాశాఖ రాష్ట్ర ఉన్నతాధికారులు ఆదేశించారు. ప్రతీ జిల్లా నుంచి డీఈఓ జిల్లా స్థాయి కమిటీ ద్వారా ముగ్గురు చొప్పున ఉపాధ్యాయులను ఎంపిక చేసి జాబితాలను రాష్ట్ర విద్యాశాఖ అధికారులకు పంపాల్సి ఉంటుంది. హనుమకొండ, వరంగల్ జిల్లాలోని ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈఓలు వాసంతి, రంగయ్యనాయుడు బుధవారం తెలిపారు. హెచ్‌ఎంల, ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు స్వీకరించి ఎంఈఓలు పరిశీలించి సంబంధిత పత్రాలతో సహా డీఈఓ కార్యాలయానికి ఈనెల 18లోపు పంపాలని వారు ఎంఈఓలను ఆదేశించారు.